క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్: రెడ్డి కాలనీ, కేంద్రీయ విహార్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ హరిసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు రెడ్డి కాలనీ ఫీడర్ పరిధిలోని శ్రీజా బృందావన్ కాలనీ, రెడ్డి కాలనీ, శాంటియా స్కూల్, బీకేఎన్‌క్లేవ్, సాయిజ్యోతి నగర్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రీయ విహార్ ఫీడర్ పరిధిలోని మయూరీనగర్ పార్క్, ఎస్‌బీఐ బ్యాంకు లైన్, కొలంబస్ స్కూల్, కేంద్రీయ విహార్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. దీనికి విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

మనూ పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్

రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థులు ఇద్దరికి సోమవారం డాక్టరేట్ ప్రకటించారు. ఉర్దూ విభాగంలో మహ్మద్ అమన్ ఉర్దూ నవలలో మతపరమైన అల్లర్లు, ఉగ్రవాదం యొక్క పరిస్థితిపై విమర్శనాత్మక విశ్లేషణ 1992–2017' అనే అంశంపై ఉర్దూ విభాగం మాజీ హెడ్ ప్రొఫెసర్ మహ్మద్ ఫారూఖ్ బక్షి పర్యవేక్షణలో థీసిస్ సమర్పించారు. అలాగే అథర్ హుస్సేన్ 'మనూ' లక్నో క్యాంపస్‌లోని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అబూ ఒమైర్ పర్యవేక్షణలో 'ఉర్దూ తహ్రీక్ కే ఫరోగ్ మే మారిఫ్ కా హిస్సా అనే అంశంపై థీసిస్ సమర్పించారు.

ఒకరికి పాజిటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 33 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో ఒకరికి పాజిటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 26 మందికి నిర్వహించినట్లు పేర్కొన్నారు.

వీధికుక్కల పట్టివేత



నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని వీధికుక్కల బెడద తీవ్రతరం కావడంతో వాటి నియంత్రణకు కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. వీధి కుక్కల బారిన పడి పలువురు గాయపడిన నేపథ్యంలో వాటిని తరలించాలని స్థానికుల నుంచి ఫిర్యాదులు అందడంతో సోమవారం మున్సిపల్ వెటర్నరీ సిబ్బంది బాచుపల్లి పరిసర ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వీధి కుక్కలను పట్టుకున్నారు. వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించి సుదూర ప్రాంతాల్లో వదిలి పెడతామని అధికారులు పేర్కొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశానికి ఉచిత శిక్షణ

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు ఉచిత పాలిటెక్నిక్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ముత్తంగి ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం శారద తెలిపారు. మండల పరిధిలోని ముత్తంగిలో పోతుకూచి సోమసుందర సామాజికసేవా సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలు రాసిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం ఉచిత పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష శిక్షణను ప్రారంభించారు. ఈ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్, హెచ్ఆర్ కృష్ణ, ఉపాధ్యాయులు నాగేందర్ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు

పటాన్‌చెరు టౌన్: మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్‌విందు అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. మండల పరిధిలోనిన చిట్కుల్ గ్రామంలో ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎండీ ఖాజామియా, అబ్దుల్ రఫీక్, యూసుఫ్, ఎండీ సిరాజ్, రజాక్, రియాజ్, ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

మహిళల భద్రతే షీటీం బాధ్యత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బాలికలు, మహిళల భద్రతే లక్ష్యంగా షీటీం పనిచేస్తుందని మియాపూర్ షీటీం ఎస్ఐ పోచయ్య తెలిపారు. సోమవారం రాత్రి తెల్లాపూర్‌లో మహిళ భద్రతపై సైబరాబాద్ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాలికలు, మహిళలు, వృద్ధులను గౌరవించాలని కోరారు. ఎవరైనా వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో రామచంద్రాపురం సీఐ సంజయ్, ఎస్ఐ శశికాంత్ రెడ్డి, తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి, నాయకులు ఇంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కుండలు చేద్దాం.. బొమ్మలు గీద్దాం

శిల్పారామంలో సమ్మర్ క్యాంపునకు ఏర్పాట్లు



శిల్పారామంలో గత సంవత్సరం నిర్వహించిన సమ్మర్ క్యాంపు



మే 1 నుండి 19వ తేదీ వరకు



మట్టి కుండ తయారు చేసిన చిన్నారి(ఫైల్)

మాదాపూర్: వేసవి సెలవుల సందర్భంగా శిల్పారామంలో సమ్మర్ క్యాంపు జరగనుంది. మే1వ తేదీ నుంచి 19వ తేదీ వరకు శిక్షణ తరగతులను నిర్వహించనున్నారు. 6 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల వయస్సు వారు వివిధ అంశాలలో శిక్షణ తీసుకోవచ్చు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు కూడా అందజేస్తారు. రిజిస్ట్రేషన్ కోసం 8886652030, 8886652004 నంబర్లలో సంప్రదించాలి

- చిన్నచిన్న మట్టి కుండలు, గ్లాస్‌లు, మగ్‌లు తయారు చేసిన వారికే వాటిని ఇస్తాం. చిన్నారులు ఇలాంటి విద్యను నేర్చుకునేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని మట్టిపాత్రల తయారీలో శిక్షణ ఇవ్వనున్న సుధాకర్ పేర్కొన్నారు.
- చిన్నారులు క్లేతో బొమ్మలు తయారు చేయడానికి ఎంతో ఇష్టపడతారు. బొమ్మలు, దేవతా విగ్రహాల ఆకృతులు తయారీకి ఆసక్తి చూపుతారు. చిన్నారులే కాకుండా పెద్దలు సైతం క్లే బొమ్మలకు ఇష్టపడతారు. అలాంటి వారికి ఈ శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయి.
- పెయింటింగ్‌తో బాటు పెన్సిల్ స్కెచ్ మరో పద్ధతి. సులభంగా స్కెచ్‌లను ఏ విధంగా గీయాలో నేర్పించనున్నారు. గీసిన స్కెచ్‌లను ప్రదర్శనలో ప్రదర్శించవచ్చు.
- ఇక దేవ భాష సంస్కృతం, భగవద్గీత శ్లోకాలు నేర్పుతారు. తీసుకున్న శిక్షణను సంవత్సరం పొడవునా ప్రాక్టీస్ చేయాలన్నారు.
- మధుబని పెయింటింగ్ శిక్షణ రాజేశ్‌జా, చెరియాల్ పెయింటింగ్‌లో రాకేశ్, ట్రైబల్ పెయింటింగ్‌లో గణేశ్‌లు శిక్షణ ఇవ్వనున్నారు.

కాలనీ కాంటాక్ట్‌లో సమస్యలు పరిష్కరించుకోండి



చందానగర్ వేమనరెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్: ప్రతి కాలనీలో జరిగే కాలనీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని మీ కాలనీ సమస్యలు పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని వేమన కాలనీ, వేమన వీకర్ సెక్షన్ కాలనీల్లో సోమవారం కాలనీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మంజులరఘునాథ్‌రెడ్డి, సర్కిల్–21 ఉప కమిషనర్ సుదాంశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రతి కాలనీ, బస్తీ, రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో ఉన్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జీహెచ్ఎంసీ అధికారులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులతో కలిసి ప్రతి కాలనీకి వెళ్లి సమస్యలు తెలుసుకొని పరిష్కరించడం జరుగుతోందన్నారు. సుమారు 15 శాఖలకు సంబంధించిన అధికారులు హాజరవుతారని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్య, నాలా సమస్యలు, ఫుట్‌పాత్, పార్కు, వీధి దీపాలు, కుక్కల బెడద నుంచి రక్షణ చర్యలు, మహిళ సంరక్షణ చర్యలు, ఆరోగ్య సమస్యలు, ట్రాఫిక్, పోలీస్ 100 డయల్, సైబర్ క్రైమ్, ఈవ్ టీజింగ్, విద్యుత్ లైన్లు తదితర సమస్యలు ఉంటే అధికారులకు తెలియజేయాలన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు ఏఎంఓహెచ్ కార్తీక్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సంపత్, చందానగర్ ఎస్ఐ శ్రీధర్, డాక్టర్ కీర్తి, ఎస్ఆర్‌పీలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, టీఆర్ఎస్ నాయకులు, కాలనీ అసోసియేషన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

కంటి వెలుగు పరిశీలన

చందానగర్ డివిజన్ పరిధిలోని వేమనరెడ్డి కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ మంజులరఘునాథ్‌రెడ్డితో కలిసి సోమవారం పరిశీలించారు. అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చందానగర్ డివిజన్ పరిధిలోని వేముకుంట కాలనీలో రంజాన్ తోఫాలను అందజేశారు.

తారానగర్‌లో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ తారానగర్‌లో కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ అండ్ సిటిజన్ గ్రీవియన్స్ డిస్పోజల్ పోగ్రామ్ వంద రోజుల కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, హెల్త్ డిపార్ట్‌మెంట్ల అధికారులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ ఆచూకీ తెలిపిన సీఈఐఆర్ పోర్టల్



బాధితుడికి ఫోన్ అందజేస్తున్న డీసీపీ శిల్పవల్లి

గచ్చిబౌలి: సీఈఐఆర్ పోర్టల్ ద్వారా చోరీ అయిన సెల్‌ఫోన్‌ను కనుగొన్నారు పోలీసులు. గచ్చిబౌలి ఇందిరానగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటున్న రాకేష్ నిద్రపోతుండగా తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు సెల్‌ఫోన్ అపహరించారు. దీంతో ఈ నెల 5వ తేదీ రాకేష్ ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్‌ను ఉపయోగించి పోలీసులు సెల్‌ఫోన్‌ను రికవరీ చేశారు. బాధితుడికి మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి ఫోన్‌ను అందజేశారు. సెల్ ఫోన్ పోయిన వెంటనే ఫిర్యాదు చేస్తే పోర్టల్ ద్వారా బ్లాక్ చేయవచ్చని, ఫోన్ ఎక్కడ ఉందో కనిపెట్టవచ్చని డీసీపీ తెలిపారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, దాత్రీ గౌడ్ తదితరులు

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మంజీరా రోడ్డులో బీఆర్ఎస్ నాయకులు దాత్రీ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దాత్రీ గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, వెంకటేష్ యాదవ్, శేఖర్ గౌడ్, మల్లేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ

రాయదుర్గం: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లి సోఫాకాలనీలోని మసీదులో దావత్ ఏ ఇఫ్తార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ జి సురేష్‌తో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు. కాగా అంతకు ముందు సోఫా కాలనీలో ఎమ్మెల్యే రంజాన్ దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గణేష్‌ముదిరాజ్, రాజునాయక్, రాజుముదిరాజ్, అక్తర్, సత్యనారాయణ, సురేందర్, ఎండి ఇబ్రహీమ్, నర్సింహరాజు, నవాజ్‌తోపాటు స్థానికులు పాల్గొన్నారు.

తారానగర్‌లో..

శేరిలింగంపల్లి: తారానగర్‌లో కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ రంజాన్ కానుకలను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ గౌరవాధ్యక్షులు వీరేశం గౌడ్, నాయకులు రాంచందర్, హబీబ్, రవియాదవ్, గోపాల్‌యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, సుభాష్, ఇక్బాల్, అజీమ్, ఫహీం, రహీం,మహబూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ దుస్తుల పంపిణీలో ఎమ్మెల్యే గాంధీ, మాజీ కార్పొరేటర్ సాయిబాబా తదితరులు



తారానగర్‌లో.. కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు

విద్యార్థులకు సేఫ్టీ క్లబ్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ దశరథ్

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం మియాపూర్ ఎస్ఐ దశరథ్ విద్యార్థులకు సేఫ్టీ క్లబ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ సేఫ్టీ, శారీరక భద్రత, యాంటీ డ్రగ్ దుర్వినియోగం, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లలో అనుమానిత సైట్‌లను క్లిక్ చేయకూడదన్నారు. మాదకద్రవ్యాలు ఎక్కడైనా అమ్ముతున్నట్లు కనిపిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని వినతి



శేరిలింగంపల్లి జాయింట్ కమిషనర్ మల్లారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: ఖాజాగూడలోని కుమ్మరి సంఘం శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ జాయింట్ కమిషనర్ మల్లారెడ్డికి గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, స్థానికులు వినతిపత్రం సమర్పించారు. జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి కార్యాలయంలో ఆయన జాయింట్ కమిషనర్‌ను కలిసి వివరించారు. శ్మశానవాటికకు ప్రహరి, నూతన బోర్, తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. దీంతో ఆయన అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఖాజాగూడ కుమ్మరి సంఘం సభ్యులు శ్రీనివాస్, భారతిభాయ్, భారతమ్మ, విఠల్, భిక్షపతి, ప్రవీణ్, లక్ష్మమ్మ, పెంటమ్మ పాల్గొన్నారు.

సర్కిల్ ఈఈ శ్రీనివాస్‌తో కార్పొరేటర్ సమావేశం

గచ్చిబౌలి డివిజన్‌లో నెలకొన్న సమస్యలను, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై శేరిలింగంపల్లి సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్‌ను గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి సోమవారం కలిశారు. ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. అలాగే పెండింగ్ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ విశాలాక్షి, ఏఈలు సునీల్, జగదీష్, నాయకులు అరుణ్‌గౌడ్, శేఖర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రజలతో ముఖాముఖి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కానుకుంటలో సోమవారం ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సకాలంలో తాగునీరు రావడంలేదని, రోడ్డు మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని కార్పొరేటర్ పుష్పనగేష్‌కు వివరించగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్‌పూర్, తెల్లాపూర్ మున్సిపాలిటీల పరిధిలో నూతనంగా ఏర్పాటైన గేటెడ్ కమ్యూనిటీలకు సైతం హెచ్ఎండబ్ల్యూ ద్వారా రక్షిత మంచినీళ్లు అందించేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హెచ్ఎండబ్ల్యూఎస్ జీఎం నారాయణ, డీజీఎం చంద్రశేఖర్, అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ సుజాత, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రతి ఇంటికీ రక్షిత మంచి నీరు అందించాలన్న సీఎం కేసీఆర్ నిర్ణయానికి అనుగుణంగా పనులు చేపట్టాలని కోరారు. నీటి ఎద్దడి నివారణకు రెండు మున్సిపాలిటీల పరిధిలో భారీ రిజర్వాయర్లు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. గేటెడ్ కమ్యూనిటీలతో పాటు నూతన కాలనీలకు సైతం రక్షిత మంచినీరు అందించాలని కోరారు.

ఇళ్ల కూల్చివేతను విరమించుకోవాలి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో 59 జీఓ ద్వారా క్రమబద్ధీకరణ చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నా రుసుం చెల్లించకపోవటంతో రెవెన్యూ అధికారులు ఇళ్లను కూల్చివేసేందుకు సోమవారం చర్యలు చేపట్టారు. దీంతో కౌన్సిలర్, బీఆర్ఎస్ నేత చంద్రారెడ్డి, బీజేపీ నేత ఆనంద్‌కృష్ణారెడ్డి బాధితులతో కలిసి ఇళ్ల కూల్చివేతను విరమించాలని అధికారులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ నిరుపేదలైన తాము ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు రూ.లక్షలు చెల్లించాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కంటే ఎక్కువ రుసుమును చెల్లించాలని అధికారులు సూచిస్తున్నారని బాధితులు వాపోయారు. తమకు ఎమ్మెల్యే, కలెక్టర్ న్యాయం చేయాలని బాధితులు కోరారు.



చిత్రప్రదర్శనలు ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ఆర్ట్‌గ్యాలరీలో సోమవారం రెండు పెయింటింగ్ ఎగ్జిబిషన్‌లను హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి ప్రారంభించారు. సుకల్యాన్ వేసిన 38 పేయింటింగ్ చిత్రాలు, తుషార్ వేసిన 15 చిత్రాలు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రదర్శనలు ఈనెల 23వ తేదీ వరకు ఉంటాయి.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

పటాన్‌చెరు టౌన్: పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాంతో ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలయ్య అన్నారు. సోమవారం పటాన్‌చెరు పట్టణంలోని కుమ్మరిబస్తీ వాసులతో ముదిరాజ్ భవన్‌లో పబ్లిక్ కాంటాక్ట్ కార్యక్రమాన్ని వివిధ శాఖల అధికారులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో ఆయా కాలనీల్లో నెలకొన్న చిన్నచిన్న సమస్యలను పరిష్కరించేందుకు జీహెచ్ఎంసీ పరిధిలో పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి సమస్యలు తెలుసుకొని సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతామన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలో రెండు టీంలను ఏర్పాటు చేశామని, ఇన్‌చార్జిలుగా జీహెచ్ఎంసీ డీఈ క్రాంతికుమార్, ఏఈ శివకుమార్ ఉన్నారని తెలిపారు. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు.

సర్వమతాల సారం ఒక్కటే: ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఆలయం, మసీదు, చర్చి నిర్మాణాలకు విరాళం అందజేత

పటాన్‌చెరు: ఒకే రోజు దేవాలయం, చర్చి, మసీదు నిర్మాణాలకు శంకుస్థాపన చేసి రూ.10 లక్షల చొప్పున 30 లక్షల విరాళాలు ప్రకటించి పరమత సహనానికి మారుపేరుగా నిలిచారు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి. అమీన్‌పూర్ మండలం పటేల్ గూడ పరిధిలోని బీహెచ్ఇఎల్ మెట్రో ఎన్‌క్లేవ్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలలో నూతనంగా నిర్మించతలపెట్టిన పోచమ్మ దేవాలయం, మసీదు, చర్చి నిర్మాణ పనులకు ఆదివారం సాయంత్రం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వమతాల సారం ఒక్కటేనని తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని వర్గాలవారిని సమానంగా చూస్తూ వారి సంక్షేమమే లక్ష్యంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సునీతాసత్యనారాయణ, సర్పంచ్ నితీశాశ్రీకాంత్, ఉపసర్పంచ్ జానకిజ్ఞానేశ్వర్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో తండ్రికి జీవిత ఖైదు

పటాన్‌చెరు టౌన్: కూతురిపై తండ్రి అత్యాచారం చేసిన కేసులో స్పెషల్ పోక్సో ఎఫ్‌టీఎస్ కోర్టు న్యాయమూర్తి జీవిత ఖైదు విధించిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులు, పీపీ అనంతరావ్ కులకర్ణి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...ఐలాపూర్ గ్రామానికి చెందిన ఓ తండ్రి 2021, ఆగస్టు 21న తల్లి ఇంట్లో లేని సమయంలో 14 సంవత్సరాల కూతురిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడు. దీంతో కూతురు ఫోన్‌లో తల్లితో జరిగిన విషయం చెప్పింది. సమాచారం తెలుసుకున్న తల్లి అదే రోజు అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో పోలీసులు నిందితుడిని స్పెషల్ పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ముందు హాజరుపర్చగా పీపీ వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి సుదర్శన్ అత్యాచారానికి పాల్పడిన తండ్రికి సోమవారం జీవిత ఖైదుతో పాటు రూ. 2వేలు జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

లైట్ హౌస్ శిక్షణ కేంద్రం పరిశీలన



మియాపూర్: చందానగర్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీలో లైట్ హౌస్ కమ్యూనిటీ ఫౌండేషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రిన్సిపల్ గ్లోబల్ సర్వీస్ గ్లోబల్ హెడ్ జాన్ కౌచర్, స్నేహ దోస్తలే, అనిల్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో శిక్షణ పొందుతున్న యువతీ, యువకులు, మహిళలను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

తక్కువ ధరకు వస్తువులు ఇప్పిస్తానంటూ మోసం

వ్యక్తి అరెస్టు

మాదాపూర్: తక్కువ ధరకే ఖరీదైన వస్తువులను ఇప్పిస్తానని డబ్బు వసూలు చేసి మోసగించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి తెలిపిన మేరకు.. పృథ్విరాజ్(34) సరస్వతీ నగర్‌లో నివాసముంటున్నాడు. తన తండ్రి ఎక్స్ సర్వీస్‌మెన్ అని, తక్కువ ధరకే ఖరీదైన వస్తువులు లభిస్తాయని నమ్మించి డబ్బును తీసుకున్న తరువాత వారికి అందుబాటులో ఉండడు. కె.శ్రీకాంత్ అనే వ్యక్తి వద్ద ఐఫోన్ ఇప్పిస్తానని వారి వద్ద నుండి రూ.81500 తీసుకుని కనిపించడం మానేశాడు. అతను పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణలో నిందితుడిపై 10 కేసులు నమోదు అయినట్టు తెలిపారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం మాదాపూర్ పోలీసులు నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.